క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

పొందూరు: మండల కేంద్రంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మి శనివారం ప్రారంభించారు. మజ్జిగ, మినరల్ వాటర్‌ను అందజేశారు. మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీకి పాలిశెట్టి సూర్యం జ్ఞాపకార్థం వారి మనవడు ప్రసాద్ నగదును సమకూర్చారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అంతరాబ ఫారెస్ట్‌లో నీటికుంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పాతపట్నం: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ నల్ల కుమారస్వామి అన్నారు. పాతపట్నం మండలంలోని అంతరాబ ఫారెస్ట్ కార్యాలయ ఆవరణలో ఉన్న నర్సరీ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అటవీశాఖ అధికారులు పి.యశస్వీ, కె.ఉమామహేశ్వరరావు, హెచ్ఎం ఎస్.వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాండ్ సీలింగ్ జరగలేదు



మాట్లాడుతున్న తాతబాబు, పూర్ణచంద్ర కిశోర్

పాతపట్నం: మండలంలోని పాశీగంగుపేట గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 58లో 14.22 ఎకరాలకు సంబంధించి ల్యాండ్ సీలింగ్ జరగలేదని ఆ గ్రామానికి చెందిన బాడాన తాతబాబు, బాడాన పూర్ణచంద్ర కిశోర్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాతబాబు, పూర్ణచంద్ర కిశోర్ మాట్లాడుతూ ఇటీవల కొంత మంది వ్యక్తులు వచ్చి, ల్యాండ్ సీలింగ్‌లో భాగంగా తమకు కేటాయించిన భూములు ఇవేనని, నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వాస్తవంగా సదరు వ్యక్తులకు ల్యాండ్ సీలింగ్ ద్వారా భూమిని కేటాయిస్తే సంబంధిత పత్రాలను తహసీల్దార్ పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ బుచ్చోడు

కొత్తూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అగ్నిమాపక అధికారి బుచ్చోడు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ఉన్న అగ్నిప్రమాద నివారణ పరికరాలను ఎలా వినియోగించాలో వివరించారు. ప్రధానంగా ఎలక్ట్రికల్ పరికరాలు, వైరింగ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారులు, వైద్య, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొత్తూరు: మండలంలోని సిరుసువాడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సం హెచ్ఎం గున్నమ్మ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన డాన్స్‌లు, పలు రకాల వేషధారణలు, నాటికలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పోలినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్య అందుతుందన్నారు. అన్ని రకాల సదుపాయాలూ ఉన్నాయన్నారు. ఉపాధ్యాయుడు సత్యనారాయణ, పీఎంసీ చైర్‌పర్సన్ సునీత, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

ఆమదాలవలస: ఈ నెల 21వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్లు ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందన్నారు. పెన్షనర్ల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వానికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అనుసంధానమయ్యేనా?

కాలువ పొడవు	మండలాలు	ప్రయోజనం	ఆయకట్టు	మొత్తం అంచనా
33 కిలో మీటర్లు	మూడు	38 గ్రామాలు	37,500 ఎకరాలు	రూ.69.78 కోట్లు



అర్ధాంతరంగా నిలిచిన సిమెంట్ పనులు

- రానున్న ఖరీఫ్‌కు సాగునీరు కష్టమే..
- ముందుకు సాగని హైలెవల్ కాలువ పనులు
- శ్రద్ధచూపని కూటమి ప్రభుత్వం



చుక్కనీరు ప్రవహించని కాలువ

సరుబుజ్జిలి: వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేసి రైతులకు సాగునీరు అందించాల్సిన హైలెవ్ కాలువ పనులు పూర్తికాలేదు. కాలువలో వర్షం నీరు తప్ప.. సాగునీరు ప్రవహించడం లేదు. వంశధార నదీ జలాలను నాగావళికి అనుసంధానం చేసే పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. వంతెనలు, అండర్ టన్నెళ్లు, అక్విడెక్ట్‌ల నిర్మాణాలు కూడా అసంపూర్తిగానే మిగిలాయి.

హైలెవల్ కాలువ లక్ష్యం ఇదీ..

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం జలాశయం 5.60 కిలో మీటర్ల హద్దు నుంచి 33.583 కిలో మీటర్ల హద్దు వరకు దాదాపు 33 కిలో మీటర్లు పొడవున హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలోని 38 గ్రామాల ఆయకట్టుకు విస్తరించాలనే లక్ష్యంతో రూ.69.78 కోట్ల అంచనాలతో రూ.57.99 కోట్ల ఒప్పంద విలువతో హైలెవల్ కాలువ పనులు ప్రారంభించారు. 5 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి. కాలువ స్థిరీకరణ ఆయకట్టు 37,500 ఎకరాలు. 24 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిపని చేయాలి. కాలువ పొడవునా అక్విడెక్ట్‌లు, సూపర్ పాసేజ్‌లు, అండర్ టన్నెళ్లు, వంతెనలు 64 వరకు చేయాలి. 50పైగా చిన్న నిర్మాణాలు చేపట్టాలి.

చేపట్టాల్సిన పనులు..

33 కిలో మీటర్ల కాలువ నిర్మాణం కోసం ఇంకా 6 కిలో మీటర్లు తవ్వకం చేయాలి. 64 రకాల నిర్మాణాలకు 34 పూర్తిచేయగా.. 23 వివిధ దశల్లో ఉన్నాయి. 7 నిర్మాణాలు మొదలుపెట్ట లేదు. హెడ్ క్రాస్ రెగ్యులేటర్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు కూడా చేయాలి.

ఇరుకు వంతెనలతో ఇబ్బందులు..

చిగురవలస గ్రామం వద్ద నిర్మించిన వంతెన వలన రాకపోకలకు గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. వంతెన విస్తీర్ణంతోపాటు అడుగు భాగం లోతులో ఉండడం వలన వర్షా కాలంలో బ్రిడ్జి నిండా నీరు చేరుతుంది. వంతెన ఇరుకుగా ఉండడం వలన వాహనాలు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్భాటమే..



ఈ ప్రభుత్వం ఆర్భాటం చేయడమే తప్ప.. పనులు విషయంలో ప్రగతి చూపడంలేదు. నదుల అనుసంధాన ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడంలేదు. పనులు పూర్తిచేయలేదు. ఆదరాబాదరాగా చేపట్టే పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పున్నపురెడ్డి తవిటినాయుడు, రైతు, మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

పనులు నిలచిపోయాయి



వంశధార, నాగావళి నదుల అనుసంధానంతో వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తామనే లక్ష్యంతో నిర్మించ తలపెట్టిన పథకం ముందుకు సాగడంలేదు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా హెచ్ఎల్‌సీ పనులపై శ్రద్ధ చూపడం లేదు. కాలువలో వర్షం నీరు తప్ప.. సాగునీరు ప్రవహించడంలేదు. పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

– చల్ల యర్రయ్య, రైతు, చిగురువలస, సరుబుజ్జిలి మండలం

చర్యలు తీసుకుంటాం

కాలువ నిర్మాణ పనులు కొంతమేరకు చేపట్టడం జరిగింది. మిగిలిన వాటిని కూడా పరిశీలన చేపట్టి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటాం. రైతన్నలకు సాగునీటిని సకాలంలో అందజేస్తాం.

– కె.రమణమూర్తి, ఈఈ, హైలెవల్ కాలువ

గొట్టిపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ



మట్టి వేస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని గొట్టిపల్లిలో ప్రభుత్వానికి చెందిన ఏడు మదుముల చెరువు, దీనికి ఆనుకొని ఉన్న గెడ్డ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానికులు తమ సొంత స్థలంతోపాటు చెరువును ఆక్రమణ చేసి మట్టి కప్పుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే చెరువును పొలంగా మార్చిన ఆక్రమణదారులు.. కొంతమట్టిని కప్పారు. మరింతగా మట్టి వేసి రియల్ ఎస్టేట్ వేయడానికి ఆక్రమణదారులు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతో విలువైన ప్రభుత్వ భూమి (చెరువు స్థలం) ఆక్రమణలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి మార్కింగ్ ఇవ్వాలని రెవెన్యూ అధికారులను విన్నవిస్తున్నారు. దీనిపై స్థానిక వీఆర్వో లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ స్థలంలో కొంత గెడ్డ స్థలం ఉందని, దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి కప్పడాన్ని ఆపించామన్నారు.

నెరవేరిన అన్నదాత ఆశలు



తొగరాం గ్రామం వద్ద దూసి గడ్డెపై నిర్మించిన వంతెన ఇదే..

ఆమదాలవలస రూరల్: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అన్నదాతల ఆశలు నెరవేరాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు న్యాయం జరిగింది. ఆమదాలవలస మండలం తొగరాం, కలివరం గ్రామాలకు చెందిన రైతులు దూసి గడ్డెపై వంతెన లేకపోవటంతో అనేక ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం రూ.89 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆ పనులు పూర్తికావటంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణం వల్ల రైతులుకు సంబంధించిన యంత్రాలు, వాహనాలకు ఎంతో ఉపయోగపడనుంది. గతంలో ఈ వంతెన లేకపోవటం వల్ల రైతులు వేరే గ్రామాల నుంచి వారి పొలాకు చేరుకోవటానికి, వాహనాల రాకపోకలకు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో వంతెన నిర్మాణం పూర్తయింది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్త..



ఎల్.ఎన్.పేట మండలంలోని పెద్దకొల్లివలస (పాత) గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే దర్శనమిస్తున్న చెత్త పోగు. హిరమండలం మేజర్ పంచాయతీలో సేకరించిన చెత్తను తీసుకుని వచ్చి ఎల్.ఎన్.పేట మండలం పెద్దకొల్లివలస పాత గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే పడేస్తున్నారు. చెత్తకు నిప్పు పెట్టడంతో అలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై వెళ్తున్న ప్రయాణీకులు పొగతో ఇబ్బంది పడుతున్నారు. చెత్త సేకరణ కేంద్రాలకు చెత్తను తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

ఘనంగా రాజమ్మ సంబరం



కొత్తూరు మండల కేంద్రంలో రాజమ్మ సంబరం శనివారం (రెండో రోజు) ఘనంగా నిర్వహించారు. కొత్తూరుకు చెందిన కొమనాపల్లి కుటుంబీకులు గ్రామ దేవత రాజమ్మను కొలుస్తున్న గృహం నుంచి రాజమ్మ మందిరం వరకు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామస్తులు, వందలాది మంది భక్తులు రాజమ్మ దాసుడు వెంట వెళ్లడంతో గ్రామంలో సందండి నెలకొంది. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సంబరాలను గ్రామ ప్రజలు ఎంతో పవిత్రంగా నిర్వహించి, మూడో రోజు మొక్కులు చెల్లిస్తారు.

- కొత్తూరు

గోతులమయం



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు పార్వతీశ్వరుని పేట జంక్షన్ వద్ద హిరమండలం–పాలకొండ లింక్ రోడ్డులో పలుచోట్లు పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి నిత్యం ఇసు కలారీలు, వివిధ వాహనాలతో రద్దీగా ఉంటుంది. గోతులు కారణంగా వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. మరమ్మతులు చేసేందుకు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు తమకు సంబంధం లేదంటే.. తమకు సంబంధం లేదని పూర్తిగా విడిచిపెట్టారు. గోతులు పూడ్చాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

- ఆమదాలవలస

తనిఖీ..



జలుమూరు మండలంలోని లింగాలవలస పంచాయతీ పరిధి హరికృష్ణమ్మపేట వద్ద బాణ సంచా దుకాణాన్ని (విజయలక్ష్మీ ట్రేడర్స్ గొడౌన్) అధికారులు శనివారం తనిఖీ చేశారు. బాణ సంచా దుకాణం నిర్వహణలో నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. నిర్వహణకు అవసరమైన అనుమతిపత్రాలను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర విషయాలను నిర్వాహకులకు సూచించారు. ఎస్ఐ అశోక్ బాబు, ఫైర్ అధికారి పి.ఆర్.రెడ్డి, రెవెన్యూ పరిశీలకులు పి.కిరణ్ పాల్గొన్నారు.

- జలుమూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి



కొత్తూరు: పాతపానుటూరులో అడ్మిషన్ ఫారాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: తురకపేటలో ప్రచారం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ కంచరాపు శ్రీనివాసరావు అన్నారు. శనివారం కొత్తకోట హైస్కూల్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని మూలసవలాపురం, తురకపేట గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వలన కలిగే ప్రయోజనాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. సీఆర్పీ ఎ.చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం..

కొత్తూరు: ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ మండలంలోని పాతపానుటూరు, కాలనీలో పాతపానుటూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జి.కృష్ణారావు, జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదమ తిరుమలరావు, ఉపాధ్యాయులు శనివారం ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న (5 ఏళ్లు నిండిన) పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఐదుగురు బాలికలను ఒకటో తరగతిలో చేర్పించారు. ఇంటి వద్దనే ప్రవేశ దరఖాస్తులను పూరించి విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్ ఫారాలను ఉపాధ్యాయులు అందజేశారు.

నవ ధాన్యాల సాగుతో మేలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: తొలకరి వర్షాలు కురిసే సమయంలో రైతులు పంట పొలాల్లో నవ ధాన్యాల సాగు చేయడం ఎంతో మేలు కలుగుతుందని వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు సూచించారు. మండలంలోని బద్రి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు నవ ధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. విత్తనాల తయారీ ఎలా చేయాలో వివరించారు. ఈ విత్తనాలను తొలకరి వర్షాలు కురిసే సమయంలో వరి పంట పొలాల్లో వేసుకుంటే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది, నేలను గుల్ల చేస్తాయన్నారు. వాటి ద్వారా వరి పంటలో మంచి దిగుబడి సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ రమణ, బద్రి గ్రామ యూనిట్ ఇన్‌చార్జి జగదీశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



బూర్జ: అప్పన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురం గ్రామానికి చెందిన కెల్లి అప్పన్న (76) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు సంపతిరావు రామారావు, కింతలి జనార్దనరావు, మొదలవలస వేణు, రమేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నీలాదేవిపురంలో..

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) గ్రామానికి చెందిన వార్డు మెంబర్ మొయ్యి రత్నాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. అనారోగ్య సమస్యతో చికిత్స పొందిన కోడి త్రినాథరావును, చేతికి ఆపరేషన్ అయిన కీర్తి శ్రీరామ్ ఇళ్ల వెళ్లి పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, నాయకులు జల్లు ఆదినారాయణ, మజ్జి నర్సింగరావు, ఏగు రాజారావు, సాకేటి శ్రీనివాసరావు, పైల చిన్నబాబు, పైల రమణమూర్తి, లావుటి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు ఉన్నారు.

27, 28 తేదీల్లో వాలీబాల్ పోటీలు

నరసన్నపేట: మండలంలోని యారబాడు గ్రామంలో ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి కన్నబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీలమ్మ గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 98484 02828ను సంప్రదించాలన్నారు. గెలిపొందిన జట్టుకు నగదు బహుమతి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొన్న జట్టు స్థానిక కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు.

70 కార్డులకు అందని రేషన్

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో 70 కుటుంబాలకు ఏప్రిల్ నెలలో సైతం రేషన్ సరుకులు అందలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామంలో గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రతినెలా ఇదే తంతు కొనసాగుతున్నా.. అధికారులు పట్టించుకునే దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. దీనిపై సీఎస్‌డీటీని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క తులసీదాస్ అన్నారు. ప్రతి నెలా 70 కార్డుదారులకు రేషన్ సరుకులు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జలుమూరు: శ్రీముఖలింగంలో శనివారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. నెలవారీ వైద్య పరీక్షలు, వ్యాక్సిన్‌లు, చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యకర్తలు చంద్రకళ, మాలతి, దేవి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు విశ్వవ్యాప్తం



రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సరుబుజ్జిలి: ఏసుక్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా విస్తరించాయని రాష్ట్ర క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు జి.శ్యామ్యూల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఏసు పునరుద్ధాన కార్యక్రమంలో భాగంగా స్థానిక పెంతకోస్తే చర్చి పాస్టర్ శామ్యూల్‌జాన్ అధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాస్టర్లు సంసోన్, అహరోన్‌రాజు, అదపాక రామారావు, సాల్మన్, ప్రసాద్, పలువురు క్రైస్తవ ఆరాధకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల సేకరించి వాటిని ఏ విధంగా రీ సైక్లింగ్ చేయాలో వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



పొందూరు: తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహిస్తున్న విద్యార్థులు



సారవకోట: అలుదు జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు



నరసన్నపేట: ఈ-వ్యర్థాలను సేకరిస్తున్న పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది



పాతపట్నం: పాతపట్నంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు, అధికారులు



జలుమూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యర్థాల సేకరణలో పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి, అధికారులు



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, సిబ్బంది, నాయకులు